సాక్షి
చిత్తూరు
గురువారం । 13 । ఏప్రిల్ । 2023



**తమిళ ఉగాది రేపు**

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం తమిళ ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. -8లో



**గజరాజుల విధ్వంసం**

పలమనేరు, ఐరాల మండలాల్లో ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి పంటలపై దాడి చేసి బీభత్సం సృష్టించింది. -8లో

| | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| చిత్తూరు | 39 | 22 |
| తిరుపతి | 40 | 22 |
| తిరుమల | 36 | 19 |
| గూడూరు | 41 | 24 |
| నగరి | 41 | 23 |

**రంజాన్ వేళలు**

| | ఇఫ్తార్ గురువారం(సా) | సహర్ శుక్రవారం(ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6.29 | 4.40 |
| చిత్తూరు | 6.31 | 4.40 |
| పుంగనూరు | 6.32 | 4.44 |

# అయ్యోర్లమయ్యాం!



అభ్యర్థికి నియామక పత్రం అందజేస్తున్న డీఈవో విజయేంద్రరావు



కౌన్సెలింగ్‌కు హాజరైన డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులు

- నెరవేరిన డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థుల కల
- సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం
- 335 మందికి నియామకపత్రాలు అందజేత

**చిత్తూరు కలెక్టరేట్** : సర్కారు ఉపాధ్యాయులు కావాలన్నది వారి కోరిక. ఎంతో కష్టపడి 1998లో డీఎస్సీ పరీక్షను రాసి అర్హత సాధించారు. అయితే చంద్రబాబు పాలనలో జరిగిన మోసం వల్ల కొలువును సాధించలేకపోయారు. అప్పటి నుంచి ఎంతో మంది పాలకులు మారినప్పటికీ వారి సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ సర్కారు అధికారంలోకి రాగానే పాదయాత్రలో వారికి ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ-98 అభ్యర్థుల కలను నెరవేర్చారు.

**అసలేం జరిగిందంటే...**

1998లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మెగా డీఎస్సీ నిర్వహించారు. రాతపరీక్ష ఫలితాలు ప్రకటించే సమయంలో నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో శాసనసభ ఉప ఎన్నికలు వచ్చాయి. దాంతో ఈ 4 జిల్లాల రాత పరీక్షల ఫలితాలను ప్రకటించలేదు. రాష్ట్రంలో మిగతా 19 జిల్లాల పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వం నిర్ణయించిన కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థుల సంఖ్య చాలా తక్కువని తేలింది. దీంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కటాఫ్ మార్కులు తగ్గిస్తూ మరో ప్రత్యేక జీవో 618 విడుదల చేశారు. ఓసీలకు 45, బీసీలకు 40, ఎస్సీ ఎస్టీ దివ్యాంగులకు 35 మార్కులు కనీస అర్హతగా నిర్ణయించారు. ఉప ఎన్నిక పూర్తయిన తర్వాత కటాఫ్ మార్కులను తగ్గించకముందు, తగ్గించిన తర్వాత ఉన్న రెండు జాబితాలనూ కలిపి ఒకేసారి ఇంటర్వ్యూలకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూల్లో కొందరు ఈ అంశాన్ని తమకు అనుకూలంగా వాడుకున్నారు. జీవో 618 ప్రకారం తక్కువ కటాఫ్ మార్కులు వచ్చినవారికి ఉద్యోగాలు వచ్చాయి. కానీ పాత జీవో ప్రకారం మెరిట్ వచ్చిన అభ్యర్థులు నష్టపోయారు. దీనిపై ఎన్నోఏళ్లుగా కోర్టులో వాదనలు జరుగుతున్నాయి. 1999లో 221 జీవో ప్రకారం మెరిట్ వచ్చిన అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ చంద్రబాబు ఆదేశాలతో విద్యాశాఖ 2000 సంవత్సరంలో దీనికి వ్యతిరేకంగా హైకోర్టుకు వెళ్లింది. అప్పుడు కూడా అభ్యర్థులకు అనుకూలంగానే తీర్పు వచ్చింది. దాన్ని కూడా తోసి పుచ్చిన చంద్రబాబు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. అక్కడా బాబు సర్కార్‌కు చుక్కెదురైంది. మెరిట్ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వాల్సిందే అంటూ సుప్రీం సైతం ఉత్తర్వులు ఇచ్చింది. కానీ టీడీపీ ప్రభుత్వం అభ్యర్థులందరికీ ఉద్యోగాలిచ్చామని, అభ్యర్థులు లేనందువల్లే కటాఫ్ మార్కులు తగ్గించామని కోర్టుకు నివేదిక ఇచ్చింది. దీనిపై 98 డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం అందరికీ ఉద్యోగాలు ఇచ్చానని చెప్పడం అబద్ధమని వారు హైకోర్టులో అప్పీలు చేశారు. ఇలా చంద్రబాబు ఇచ్చిన జీవో 618 వేలాదిమంది అభ్యర్థుల జీవితాలను చీకట్లోకి నెట్టేసింది. మెరిట్ సాధించి కూడా ఉద్యోగాలకు దూరమైన ఆ అభ్యర్థులు మనోవ్యథకు లోనయ్యారు.

**వెలుగులు నింపిన సీఎం జగన్**

అన్యాయం జరిగిన డీఎస్సీ-98 అభ్యర్థుల కుటుంబాల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. పాతికేళ్ల వారి పోరాటానికి వైఎస్సార్‌సీపీ సర్కారు న్యాయం చేసింది. చాలా ఏళ్ల తర్వాత వారు సర్కారు బడుల్లో ఉద్యోగాల్లో చేరుతుండడంతో వారి ఆనందానికి అవధులు లేవు.

**నియామక పత్రాలు అందజేత**

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని క్వాలిఫైడ్ అభ్యర్థులకు చిత్తూరు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈవో విజయేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌కు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 650 మంది ఉండగా, అందులో 597 మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. నిబంధనల ప్రకారం పరిశీలనలో 553 మంది అభ్యర్థులు అర్హులుగా తేలారు. ఇందులో ఈ నెల 12వ తేదీన 350 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి రోజు కౌన్సెలింగ్‌లో 15 మంది గైర్హాజరయ్యారు. మిగిలిన 335 మందికి వారు కోరుకున్న ప్రాంతాలకు నియామకపత్రాలను డీఈవో అందజేశారు. ఈ నెల 13న 203 మందికి కౌన్సెలింగ్ ఉంటుందని డీఈవో కార్యాలయం అధికారులు వెల్లడించారు.

**సీఎంకు రుణపడి ఉంటాం**



మేము చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలో ఉంటున్నాం. నేను 98 డీఎస్సీలో ఉత్తీర్ణత చెందాను. అప్పుడు మాకు అన్యాయం జరిగింది. 24 ఏళ్లపాటు ఇంటి వద్దనే ఉండి నాయకులు చేస్తున్న ఉద్యమానికి సహకరించాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు మాకు న్యాయం చేశారు. సీఎంకు రుణపడి ఉంటాం.

– హేమలత, డీఎస్సీ అభ్యర్థిని

**గతంలో ఎవరూ పట్టించుకోలేదు**



ఎన్నో సంవత్సరాల నుంచి మేము న్యాయం కోసం పోరాడాము. ఎవరూ మా సమస్యను పట్టించుకోలేదు. 98 డీఎస్సీలో క్వాలిఫై కావడంతో ఉద్యోగం వస్తుందని కలలు గన్నాం. మాకు అప్పట్లో తీవ్ర అన్యాయం జరిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి మా అందరికీ ఉద్యోగాలు అందజేసిన సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం

– సోమశేఖర్‌రెడ్డి, డీఎస్సీ అభ్యర్థి

## మంత్రి పెద్దిరెడ్డితో నూతన కలెక్టర్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ షన్‌మోహన్

**చిత్తూరు కలెక్టరేట్** : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ షన్‌మోహన్ బుధవారం మంత్రిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. తిరుపతిలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

**కలెక్టర్ ను కలిసిన పలువురు ప్రముఖులు**

నూతన కలెక్టర్ షన్‌మోహన్‌ను చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎస్టీయూ నాయకులు గంటామోహన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రమేష్‌బాబు, వైస్ చైర్మన్ గోవర్ధన్‌బాబీ, మాజీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మాదిరెడ్డివిజయసింహారెడ్డి, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పన్నీర్‌సెల్వం, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం తదితరులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

## ఎస్వీసీఆర్ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీప్లస్ గ్రేడ్

**పలమనేరు:** పట్టణంలోని శ్రీవర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీప్లస్ గ్రేడ్ వచ్చినట్లు ప్రిన్సిపల్ వెంకటేశులు బుధవారం తెలిపారు. స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెలలో కళాశాలను పరిశీలించి, న్యాక్ పీర్ టీం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ గ్రేడ్‌ను సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన కళాశాల అభివృద్ధి కమిటీకి, అధ్యాపక బృందానికి, పూర్వ విద్యార్థులకు వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం ధన్యవాదాలు తెలిపారు.

## న్యూస్‌రీల్

### కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్



సీనియర్ సివిల్‌జడ్జి కరుణకుమార్

**చిత్తూరు అర్బన్:** ఆస్తి పన్నుకు సంబంధించి కోర్టులో పెండింగ్ ఉన్న కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ సూచనల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఆస్తి పన్నుకు సంబంధించిన కేసులు మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొత్తగా గృహాలు నిర్మించుకునేవారికి అప్రూవల్ సంబంధించిన కేసులు ఉన్నవారు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. నీటి కాలుష్యానికి సంబంధించి మున్సిపల్, కాలుష్య నియంత్రణ బోర్డు పరిధిలోని కేసులను సైతం జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కారించుకోవచ్చని సూచించారు. జిల్లా, మండల స్థాయి న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా కేసులను, ప్రిలిటిగేషన్ వేసి పరిష్కరించుకోవచ్చని వివరించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు ఈ తరహా కేసులుంటే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు సహకరించాలన్నారు.

### జిల్లాకు చేరిన ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు



డిక్షనరీలను పరిశీలిస్తున్న అధికారులు

**పూతలపట్టు:** జగనన్న విద్యాకానుకలో భాగంగా జిల్లాలోని పూతలపట్టు ప్రాథమిక పాఠశాలకు డిక్షనరీలు చేరాయి. బుధవారం వాటిని జిల్లా ఏపీసీ పి.ఆర్ వెంకటరమణరెడ్డి పరిశీలించారు. జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న 6 వతరగతి విద్యార్థులకు ఈ డిక్షనరీని అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలోని విద్యార్థులకు మొత్తం 9460 డిక్షనరీలు చేరినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా ఏపీసీ ఎంఒ పి.ఉదయలక్ష్మీ పాల్గొన్నారు.

### విద్యుత్ సర్వీసుల తనిఖీ

**చిత్తూరు కార్పొరేషన్:** ఉమ్మడి జిల్లాలో బుధవారం ట్రాన్స్‌కో డివిజన్ల పరిధిలోని సర్వీసులను సాయంత్రం నుంచి రాత్రి వరకు సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3349 సర్వీసులు తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్, తిరుపతి రూరల్, పుత్తూరు, చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, మదనపల్లె, పీలేరు, పుంగనూరు పరిధిలో విద్యుత్ చౌర్యం జరిగినట్లు గుర్తించారు. అందులో మొత్తం 661 సర్వీసులకు రూ.14.62 లక్షలు జరిమానా విధించారు. ఈ మేరకు వారికి నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు.

### ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

**తిరుపతి తుడా:** టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు భువనేశ్వర్‌కు చెందిన శివం కాండెవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఈ సంస్థ తరఫున ప్రతినిధి వై.రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డీడీని తిరుపతిలోని పరిపాలన భవనంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు.

### శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,314 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,715 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.4.48 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# ఆశీర్వదించారు..సేవ చేస్తున్నాను!



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా



కంటి ఆపరేషన్ చేసుకున్న వృద్ధులు

**నగరి** : ''ఓటుతో ఆశీర్వదించినందునే నేడు మంత్రిగా ఉన్నాను, అందువల్లే ప్రజలకు సేవచేసే అవకాశం లభించింది.'' అని పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. తన క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం నేత్ర వైద్య శిబిరం ముగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేసుకున్న అవ్వతాతలు భావోద్వేగానికిలోనై మాట్లాడుతూ ఇంటి బిడ్డలా మంత్రి ఆదుకుంటున్నారని వృద్ధాప్య దశలో ఆమె చేసిన మేలు ఎన్నటికీ మరువలేనిదని ప్రశంసించారు. మంత్రి మాట్లాడుతూ తాను నేడు సేవ చేస్తున్నానంటే అది ఓటుతో ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమే అన్నారు. రెండు సార్లు నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతోనే మంత్రినయ్యానని అన్నారు. పదిమందికి సేవ చేసే అవకాశం కొందరికే దక్కుతుందని ఆ కొంత మందిలో తానున్నందుకు గర్వపడుతున్నానన్నారు. గడపగడపకు వెళ్లిన సమయంలో కంటిచూపు మందగించి వారి పనులు వారు చేసుకోలేని వృద్ధుల పరిస్థితిని కళ్లారా చూశానని తెలిపారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి ఆపరేషన్ చేసుకోలేని వారికి సహకారం అందించాలని శంకరనేత్రాలయ వారిని పలుమార్లు సంప్రదించి పట్టుబట్టి నగరికి రప్పించినట్లు వివరించారు. కంటి చూపునిచ్చావంటూ ఆప్యాయంగా అవ్వతాతలు ఇచ్చే దీవెనలు భగవంతుడి దీవెనలుగానే భావిస్తున్నామన్నారు. రాజకీయం అంటే ప్రజలకు అండగా ఉంటూ వారి కష్టాలను దూరం చేయడమేనని జగనన్న చెప్పిన మాటలనే వేదంగా భావిస్తూ తాను ముందుకు వెళుతున్నానన్నారు. జగనన్నను, తనను ప్రజలు ఇలాగే ఆశీర్వదిస్తూ ఉండాలని ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో 370 మందికి ఉచితంగా ఆపరేషన్ చేసినట్లు వివరించారు. వైద్యసేవలు అందించిన శంకరనేత్రాలయ వైద్యులను ఫలపుష్పాలతోను, దుశ్శాలువలతోను సత్కరించారు. ఆపరేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి తన నివాసం వద్దే భోజనం పెట్టి వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించి, వాడాల్సిన మందులను అందజేసి ఇళ్లకు పంపించారు. నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, మునివేలు, దీప, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# ‘అగ్ర’ పేదలకు ఆర్థిక సాయం

- జిల్లాలో 23,668 మందికి రూ.35.5 కోట్లు లబ్ధి
- కలెక్టరేట్‌లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షన్‌మోహన్



ఈబీసీ నేస్తం మెగాచెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు, పక్కన కలెక్టర్ షన్‌మోహన్

**సాక్షి చిత్తూరు:** అగ్రవర్ణాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేసిందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం మంజూరు ప్రక్రియను ప్రారంభించారు. దీన్ని స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులు, లబ్ధిదారులు వీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తోందని గుర్తుచేశారు. రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన వారికి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం వర్తింప చేస్తున్నట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా పేద అక్క చెల్లెమ్మలకు ఏటా రూ.15,000 చొప్పున మొత్తం రూ.45,000 ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. ఈ సాయాన్ని మహిళలు వినియోగించుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలన్నారు. వారి కాళ్లపై వారు నిలబడేలా సొంత వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ షన్‌మోహన్ మాట్లాడుతూ అగ్రవర్ణాలలోని పేదలకు ఆర్థిక సాయం అందజేసేందుకు వైస్సార్ ఈబీసీ నేస్తం పథకంను అమలు చేయడం జరుగుతోందన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. అర్హత కలిగి ఉండి లబ్ధి పొందని వారు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఈబీసీ నేస్తం కింద 2022–23లో 23,668 మందికి రూ.35.50 కోట్లు లబ్ధి చేకూరుతోందని వివరించారు. విదేశీ విద్య ప్రభుత్వ సలహాదారులు జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం చేసి చూపిస్తున్నారని గుర్తుచేశారు. అనంతరం ఈబీసీ నేస్తం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

**జీవితాంతం రుణపడి ఉంటాం**



ఈబీసీ నేస్తం పథకానికి వలంటీర్ దరఖాస్తు చేయించారు. తాను తొలిసారి ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నాను. ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తాను. పదవ తరగతి చదివే మా పాపకు అమ్మఒడి పథకం కింద లబ్ధి చేకూరుతోంది. నాకు వితంతు పింఛను వస్తోంది. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితుల్లో జగనన్న అందిస్తున్న పథకాలు నాకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. మా కుటుంబం మొత్తం జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటుంది.

–గాయత్రి, దుర్గా నగర్ కాలనీ, చిత్తూరు

**పేదల గురించి ఆలోచించే సీఎం**



మా కుటుంబం వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈబీసీ నేస్తం కింద మొదటి విడతలో లబ్ధి పొందాను. రెండో విడతలో కూడా లబ్ధి పొందుతున్నాను. దీంతోపాటు తిమ్మిసానిమెట్ట వద్ద ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. మా పాపకు జగనన్న విద్యాదీవెన కింద లబ్ధి అందుతోంది. పేదల గురించి ఆలోచిస్తున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– కళావతి, చిత్తూరు

# సమన్వయంతో పనిచేయండి

- అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలి
- నియోజకవర్గాల పరిశీలకుల సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి



జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**సాక్షి, తిరుపతి:** వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని రాష్ట్ర మంత్రి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ గ్రాండ్‌లో బుధవారం చిత్తూరు, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలుచేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలుచేసిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. 27 నియోజకవర్గాల్లో గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సమీక్షించారు. రోజూ రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. అందరినీ సమన్వయపరచి అత్యధిక స్థానాల్లో పార్టీ విజయం సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.

## వివాహేతర సంబంధమే..హత్యకు కారణం



నిందితుడిని అరెస్ట్ చూపిస్తున్న సీఐ గంగిరెడ్డి

**చిత్తూరు అర్బన్:** వివాహేతర సంబంధమే మహిళ హత్యకు కారణమని సీఐ గంగిరెడ్డి, ఎస్ఐ రామకృష్ణ అన్నారు. చిత్తూరు నగరం శేషాచలపురంలో అనుమానంతో ఓ వ్యక్తి మహిళను హత్య చేసిన ఘటన తెలిసిందే. దీనిపై బుధవారం స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో నిందుతుడిని అరెస్ట్ చూపించి వివరాలు వారు వెల్లడించారు. శేషాచలపురం గాంధీ యానాదికాలనీ చెందిన కస్తూర్తి (49) మేకలు మేపుతూ జీవనం సాగించేది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన శ్రీరాములు(52)తో సహజీవనం వరకు వెళ్లింది. అప్పటి నుంచి కస్తూరి ఇతరులతో మాట్లాడితే శ్రీరాములకు గిట్టదు. ఇలా అనుమానం పెరగడంతో వారు తరచూ గొడవలు పడేవారు. ఇది కాస్త ముదిరి..శ్రీరాములు ఆమెను వదిలించుకునే ప్రయత్నం చేశాడు. సోమవారం సాయంత్రం శేషాచల పురం గ్రామ సమీపంలో కస్తూరి మేకలు మేపుతుండగా గొడవకు దిగాడు. ఆ ప్రాంతంలో మాటామాటా పెరిగి దోటి కొంకీతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ప్రారంభించి, మంగళవారం ఉదయం నిందుతుడిని అరెస్టు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవి, పరంధామరెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీ అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానము

అరగొండ గ్రామం, తవణంపల్లి మండలం, చిత్తూరు జిల్లా

**బహిరంగవేలం ప్రకటన**

శ్రీ అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి ఈ క్రింది కనబరిచిన వ.నెం.1 నుండి 3 వరకు గల ఐటములకు లైసెన్సు హక్కులు తేది. 01.05.2023 నుంచి 31.03.2024 వరకు 11 నెలల కాలమునకు మరియు వ.నెం.4 నకు దేవస్థానము నందు తేది. 20.04.2023న బహిరంగవేలము ఉదయము 10.00 గంటలకు నిర్వహించబడును.

| వ.నెం. | లైసెన్సు/లీజు వివరములు | ధరావత్తు (రూ.) |
|---|---|---|
| 1 | పార్కింగ్ స్థలము నందు క్యాంటీను నిర్వహించుకొను లైసెన్సు హక్కుకు | 10,000.00 |
| 2 | కొబ్బరి చిప్పలు సేకరించుకొనే లైసెన్స్ హక్కుకు (సగ భాగము) | 20,000.00 |
| 3 | భక్తుల పాదరక్షలు బధ్రపరచుకొను లైసెన్స్ హక్కుకు | 2,000.00 |
| 4 | దేవస్థానము వారు సేకరించిన ఎండు కొబ్బరి ఉన్నది వున్నట్లుగా విక్రయించుటకు | 1,000.00 |

మిగిలిన వివరములకు దేవస్థానము కార్యాలయము పనివేళల యందు సంప్రదించగలరు.


శ్రీ స్వామి వారి సేవలో

పి.సురేంద్రరెడ్డి, చైర్మన్ మరియు పాలకమండలి సభ్యులు

ఎస్.వెంకటసుబ్బారెడ్డి, బి.యస్సీ., కార్యనిర్వహణాధికారి

# కోటాకు మించినా కోతల్లేవు

- పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- అయినా అంతరాయం లేదు
- మార్చిలో రోజుకు 22 మిలియన్ యూనిట్ల వాడకం
- ఏప్రిల్‌లో 24 ఎంయూలకు పైగా వినియోగం



**చిత్తూరు కార్పొరేషన్:** భానుడు ప్రతాపం చూపుతున్నాడు.. మార్చి నుంచి వేడి సెగలు ప్రారంభమయ్యాయి.. ఎండలు మండుతున్న కొద్దీ కరెంటు వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఫిబ్రవరి, మార్చి నెలల మధ్య విద్యుత్ వినియోగంలో భారీ తేడా చోటుచేసుకుంది. ఉమ్మడి జిల్లాలో రోజుకు 24 మిలియన్ యూనిట్ల (ఎంయూ)విద్యుత్ వినియోగిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రానురాను ఎండలు తీవ్రమయ్యేకొద్దీ ఇంకా వినియోగం పెరిగే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు అంచనా వేస్తున్నారు. వినియోగం పెరుగుతున్నా ఇప్పటి వరకు ఎక్కడా సరఫరాలో అంతరాయం లేకుండా ఇస్తున్నారు. ఫిబ్రవరిలో 20, మార్చిలో 22, ఏప్రిల్‌లో 24 మిలియన్ యూనిట్లకు పైగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఈ నెలల రోజువారీ వినియోగం దాదాపు 2 మిలియన్ యూనిట్లు అదనంగా పెరిగింది.

**కోటా దాటింది**

ఉమ్మడి జిల్లాలో మార్చి నెలకు 620 మిలియన్ యూనిట్ల కోటాగా ఎస్పీడీసీఎల్ కేటాయించింది. ఈ లెక్కన రోజు 20.66 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగం కావాలి. ఈ కోటా ఎప్పుడో దాటింది. కోటా కంటే 1.44 మిలియన్ యూనిట్లు ఎక్కువగా వినియోగం అవుతున్నట్లు తేలింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల మధ్య భారీగా లోడు పడుతోంది. మే నెలలో రోజువారీ వినియోగం 26 మిలియన్ యూనిట్లు చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారం నుంచి పగలు ఓ మోస్తరు ఎండలున్నా రాత్రి పూట చలి వణికించేది. ఆ తర్వాత వాతావరణంలో మార్పు వచ్చింది. ఉక్కపోత తట్టుకోలేక చాలా మంది ఏసీలు, కూలర్లు వినియోగించడం ప్రారంభించారు. కార్యాలయాలు, కార్పొరేట్ కార్యాలయాల్లో సైతం ఏసీలు మొదలయ్యాయి. ఇక ఫ్యాన్‌లు 24 గంటలూ పని చేయాల్సిందే. దీంతో ఒక్కసారిగా గృహ వినియోగంలో రోజూ మిలియన్ యూనిట్లలో తేడా కనిపిస్తోంది. మరో వైపు చిన్నతరహా పరిశ్రమలు పెరుగుతున్న కొద్దీ వినియోగం ఎక్కువ అవుతోంది. జిల్లాలో ఉద్యాన పంటల వల్ల ఏడాది పొడవునా బోర్లు నడుస్తూనే ఉంటాయి. కాబట్టి నిరంతరం విద్యుత్ అవసరం ఉంటుంది. దీనివల్ల కూడా కరెంటు జిల్లాలో ఎక్కువగా వినియోగంలో ఉంది.

**ఉమ్మడి జిల్లాలోని సర్వీసులు**

| కేటగిరి వారీగా సర్వీసులు | |
|---|---|
| గృహ సర్వీసులు | 13,73,346 |
| వాణిజ్యం | 1,61,215 |
| వ్యవసాయం | 3,17,709 |
| పరిశ్రమలు | 21,175 |
| ప్రభుత్వ సర్వీసులు | 46,690 |
| వీధిదీపాలు | 17000 |
| ఆర్‌డబ్ల్యూఎస్ | 13924 |
| హెచ్‌టీ | 1906 |
| మొత్తం | 19,52,790 |

**ఏప్రిల్‌లో విద్యుత్ వాడకం (ఎంయూలలో)**

| తేదీ | వినియోగం |
|---|---|
| 3 | 21.68 |
| 4 | 22.32 |
| 5 | 22.85 |
| 6 | 23.76 |
| 7 | 24.74 |
| 8 | 24.34 |
| 9 | 23.65 |

**పెరిగినలోడు**

విద్యుత్ వాడకం పెరగడంతో రోజు ఉమ్మడి జిల్లాలో 35–40 ట్రాన్స్‌ఫార్మర్లకు లోడ్ పెరిగి మరమ్మతులకు గురవుతున్నాయి. వీటిని విద్యుత్ మరమ్మతుల కేంద్రంలో బాగు చేయిస్తున్నారు. అదే విధంగా ఫిబ్రవరిలో రోజు 20 మిలియన్ యూనిట్లు కోటా ఇచ్చారు. మార్చిలో నెలకు 20.66 మిలియన్ యూనిట్లు కోటాగా నిర్ణయించగా అదనంగా 1.44 మిలియన్ యూనిట్లు వాడకం జరిగింది.

**వాడకం పెరిగింది**

“ ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వాడకం పెరిగింది. ఫిబ్రవరి రెండో వారం నుంచి వాడకం పెరుగుతోంది. రోజూ జిల్లాలో 40కు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురవుతున్నాయి. వాటిని బాగుచేయిస్తున్నాం. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం కృషి చేస్తున్నాం. దీనిపై ఈఈ నుంచి ఏఈ వరకు సమీక్షిస్తున్నాం. నిరంతర సరఫరా కోసం అదనపు సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు జరుగుతున్నది. - కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో







**బంగారం :**

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.61,500 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,600 |

**వెండి:**

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.76,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.78 |

## యువకుడి ఆత్మహత్య

**చిత్తూరు అర్బన్:** నగరానికి చెందిన యువకుడు మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ నరసింహరాజు కథనం మేరకు.. కట్టమంచిలోని గాండ్లవీధికి చెందిన గౌతమ్‌కుమార్ (33) హైరోడ్డుపై టిఫిన్ దుకాణం నడుపుతున్నాడు. ఇతనికి భార్య ఉంది. మంగళవారం రాత్రి దుకాణం నుంచి వచ్చిన ఇతను ఇంట్లోకి వెళ్లాడు. కొద్ది సేపు తరువాత గదిలోకి వెళ్లి పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పిలిచినా పలకకపోవడంతో స్థానికుల సాయంతో తలుపు పగులగొట్టి చూడగా అప్పటికే గౌతమ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. బుధవారం దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## గాయపడిన వృద్ధురాలి మృతి

**చిత్తూరు అర్బన్:** ఇంట్లో దీపం పడి వ్యాపించిన మంటల్లో గాయపడిన వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. వన్‌టౌన్ సీఐ నరసింహరాజు కథనం మేరకు, నగరంలోని కట్టమంచికి చెందిన ఎస్.చంద్రమ్మ (70) మూడు రోజుల క్రితం ఇంట్లో దీపం వెలిగించి, గూట్లో పెడుతుండగా శరీరంపై పడి మంటలు వ్యాపించాయి. కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్ఐ వసంతకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆ 14 ఏళ్లలో ఎందుకు చేయలేదు బాబూ?



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

**వెదురుకుప్పం:** అధికారంలో ఉన్న ఆ 14 ఏళ్లు చంద్రబాబు గ్రామాల్లో రోడ్లు ఎందుకు వేయలేదని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రశ్నించారు. మండలంలోని ముతాలం గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే టీడీపీ కి చెందిన కొందరు అమాయకులకు మద్యం తాగించి గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టిన నాలుగేళ్లలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో గత 70 యేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లు నేడు సీఎం జగన్ సారథ్యంలో తారు రోడ్లుగా రూపుదిద్దుకున్నాయని తెలిపారు. జక్కిదొన నుంచి ఎగువ కనికాపురం, దిగువ కనికాపురం మీదుగా ముతాలం వరకు రోడ్డును తారు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు తెలిపారు. రూ.7 కోట్లు ప్రతిపాదనలు కూడా పంపామని నిధులు మంజూరైన వెంటనే రోడ్డు నిర్మించి ఆ తరువాత గ్రామంలోకి అడుగు పెడతానని గ్రామస్తులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అంతకు ముందు ఎగువకనిపారుం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు లోకనాథరెడ్డి, అయ్యప్పరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# పంటలపై గజరాజుల దాడి

**ఐరాల:** మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. వినాయకపురం, రంగమ్మచెరువు, మొరవపడ్డిపల్లెలో మంగళవారం రాత్రి మామిడి, చెరుకు, అరటి, వరి పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసింది. రైతు మోహన్‌రెడ్డికి చెందిన మామిడి తోటకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి, మామిడి చెట్లను విరిచేసి, కాయలను తిని తొక్కి నాశనం చేశాయి. వీరభద్రకు చెందిన చెరుకు పంటను, క్రిష్ణయ్యకి చెందిన వరి పంటను, పార్వతమ్మకు చెందిన మామిడి, అరటి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. సుమారు రూ. 2 లక్షల పంట నష్టం వాటిలినట్లు భాధిత రైతులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న మండల అటవీ శాఖాధికారి జయశంకర్ ధ్వంసమైన పంటలను పరిశీలించారు.

**పలమనేరు:** మండలంలోని చెత్తపెంట, ఊసరపెంట, కాలువపల్లి గ్రామాలకు చెందిన రైతుల పంటలను మంగళవారం రాత్రి 20పైగా ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. ఈ దాడుల్లో రాగి, టమాటా, వరి, పశుగ్రాసం పంటలు భారీగా దెబ్బతిన్నాయి. విషయం తెలిసిన ఎలిఫెంట్ ట్రాకర్లు ఏనుగులను పంటలనుంచి అడవిలోకి తరిమేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఏనుగులు ట్రాకర్స్‌పై తిరగబడినట్టు తెలిసింది. అయితే చాకచక్యంగా వారు ఏనుగులను అడవిలోకి మళ్లించారు.

# హత్యకేసులో నిందితుడి అరెస్ట్

**పుంగనూరు:** మండలంలోని అగస్తీశ్వరస్వామి కొండ వద్ద ఈనెల 6న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సురేష్ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని కట్టక్రిందపాళ్యానికి చెందిన సురేష్ తన స్నేహితుడి (మైనారిటీ తీరని యువకుడి) భార్యను లైంగికంగా వేధించసాగాడు. ఈ క్రమంలో ఆ మైనర్ అగస్తీశ్వరస్వామి కొండ వద్దకు సురేష్‌ను తీసుకెళ్లి బండరాయితో కొట్టి హత్య చేశాడు. ఈ మేరకు నేరం అంగీకరించాడని తెలిపాడు. ఈ మేరకు నిందితుడైన మైనర్ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# రేపు కాణిపాకంలో తమిళ ఉగాది

**కాణిపాకం(యాదమరి):** తమిళ ఉగాది పండుగ సందర్భంగా శుక్రవారం కాణిపాకంలో స్వామి వారికి చందానాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. వేకువజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ నిర్వహించి పూజలు చేసి చందానాలంకరణ, పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఆ రోజు స్వామివారి ఆర్జిత సేవలు అన్ని రద్దు చేస్తున్నట్లు వారు తెలిపారు.

**21న బెంగళూరులో కల్యాణం**

వరసిద్ధి వినాయక స్వామి కల్యాణోత్సవాన్ని ఈ నెల 21న బెంగళూరులోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. బెంగళూరులోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 21న శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20 కాణిపాకం నుంచి స్వామివారి ప్రచార రథం బయలుదేరనున్నట్లు వారు తెలిపారు.

**మూలవిరాట్ ఫొటో తీసినవ్యక్తిపై ఫిర్యాదు**

వరసిద్ధి వినాయక స్వామి మూలవిరాట్‌ను ఫొటో తీసిన ఆకతాయిపై పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. వారు బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ వీఐపీ ద్వారా స్వామివారి దర్శనార్థం విచ్చేసి మూలవిరాట్‌ను ఫోన్‌లో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. దీనిపై కాణిపాకం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

**ఎస్పీకి విన్నపం**

ఆలయ భద్రతకు అదనపు సిబ్బంది అవసరమని జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డికి విన్నవించినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో చాలా సంవత్సరాల నుంచి విధులు నిర్వహించే హోంగార్డులకు అందరితో పరిచయాలు ఉన్నందున విధులు సక్రమంగా నిర్వహించలేక పోతున్నారని వివరించారు. ప్రస్తుతం 45 మంది మాత్రమే ఉన్నారని వారిని మార్పు చేసి నూతనంగా సిబ్బందిని నియమించాలని కోరినట్లు వారు తెలిపారు.

**ఆలయంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదు**

వినాయక స్వామి ఆలయంలోకి సెల్‌ఫోన్ అనుమతించేది లేదని ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు హోంగార్డులకు, ఆలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఆలయంలోకి వచ్చే భక్తులు, అధికారులు, సిబ్బంది అందరికీ సెల్‌ఫోన్‌లు అనుమతులు లేవని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఎవరైనా సెల్‌ఫోన్‌లతో లోపలకు వచ్చినట్టు తెలిస్తే వారిని బయటకు పంపాలని సూచించారు. ఆలయ సిబ్బంది, ఆలయంలో విధులు నిర్వహించే అధికారులందరూ ఆలయం వెలుపల సెల్‌ఫోన్‌లు ఉంచి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, హోమ్‌గార్డుల ఎస్ఐ వినాయకం తదితరులు పాల్గొన్నారు.

**శాస్త్రోక్తంగా తిరుమంజనం**

ఆలయంలో అర్చక వేదపండితులు, అధికారులు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. బుధవారం మధాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆలయంలో మూలవిరాట్‌కు, ధ్వజస్తంభం, సుపథ మండపం వద్ద నీటితో శుద్ధి చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రాధాన్యతగా భావించండి



రీసర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ షన్‌మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా భావించి వేగవంతం చేయాలని కలెక్టర్ షన్‌మోహన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వరుస సమీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అత్యంతప్రాధాన్యతా కార్యక్రమాల్లో రీ సర్వే ఒకటన్నారు. దీన్ని నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయాలన్నారు. రీ సర్వే పూర్తయిన 134 గ్రామాలకు సంబంధించి సర్వేరాళ్లు నాటే కార్యక్రమం వేగవంతం చేయాలనన్నారు. భూ యజమానులకు ఎటువంటి సమస్యలు లేకుండా హక్కు పత్రాలను అందజేయాలని చెప్పారు. సమీక్షలో ఆర్‌డీవోలు రేణుకా, సుజన, శివయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ కనక ప్రసాద్, డీఐలు, ఇతర సర్వే అధికారులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూడాలని తెలిపారు. సమావేశంలో సీపీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఎంహెచ్ఓ ప్రకాశం, డీసీహెచ్ఎస్ నాయక్, ఎస్ఎస్ఏ పీఓ వెంకటరమణారెడ్డి రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ పీడీ నాగశైలజ పాల్గొన్నారు

# పోటీ పరీక్షల సమాచార పత్రిక ఆవిష్కరణ

**తిరుపతి ఎడ్యుకేషన్ :** విజయవాడలోని విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం తిరుపతి విశ్వం విద్యాసంస్థ ముద్రించిన సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ పోటీ పరీక్షల సమాచార పత్రికను రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా వివిధ పోటీ పరీక్షల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. సైనిక్, నవోదయ, పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతూ వారికి బంగారు భవిష్యత్తును అందిస్తున్నారని కొనియాడారు. విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థిని సి.మహతిరెడ్డి 120మార్కులకు 118మార్కులు సాధించి ప్రథమ ర్యాంకును కైవసం చేసుకుందని, అలాగే ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో సి.వర్షిక రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు, సైనిక్ ఫలితాల్లో వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో 4 ప్రథమ ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర నాయకులు బి.రవీంద్రనాథ్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఓ.వెంకటరమణ రెడ్డి, రెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ దేవానందరెడ్డి తదితరులు